క్లుప్తంగా

కసాపురంలో పూర్వాభాద్ర హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకుని మంగళవారం హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్వాభద్ర హోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నంది అవార్డుగ్రహీతకు సన్మానం

గుంతకల్లుటౌన్: చెక్కభజన గాయకురాలిగా, డ్యాన్సర్‌గా అత్యంత ప్రతిభ కనబరుస్తూ తెలంగాణ కల్చరల్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నుంచి ఇటీవల నంది అవార్డును అందుకున్న ట్రాన్స్‌జెండర్ చిత్రను ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు సన్మానించారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా బాధ్యుడు కృష్ణమూర్తి, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర, ఐద్వా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ చెక్కభజనలో రాణిస్తూ నంది అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకుడు జగ్గిలి రమేష్, నాయకులు షకీరా, సుగుణ, సరస్వతీ, నాగరాజు, రాము పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక



మాట్లాడుతున్న స్వామిదాస్

గుంతకల్లుటౌన్: ఎమ్మార్పీఎస్ పట్టణ, మండల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమితి రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ తెలిపారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా చిన్నా, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా నాగరాజును ఎన్నుకున్నారు. అలాగే పట్టణ కమిటీ అధ్యక్షుడిగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా శిరీష, ఉపాధ్యక్షురాలిగా సెనీ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణమ్మ ఎన్నికయ్యారు. స్వామిదాస్ మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధన కోసం పోరాడాలని కమిటీలకు సూచించారు.

మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శిగా జాఫర్‌ఖాన్



గుంతకల్లు: స్థానిక రైల్వే స్టేషన్ మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శిగా పి.జాఫర్‌ఖాన్ ఎన్నికై నట్లు ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ (ఏపీఓ) పీర్‌బాబు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న మజ్దూర్ యూనియన్ స్టేషన్ బ్రాంచ్ కమిటీ కాల పరిమితి పూర్తికావడంతో నూతన కమిటీ ఏర్పాటుకు మజ్దూర్ యూనియన్ నేతలు నూతన కమిటీకి సిఫారసు చేశారు. దీంతో మూడేళ్ల కాల పరిమితితో కూడిన స్టేషన్ బ్రాంచ్ కమిటీని ఆయన ప్రకటించారు. గుంతకల్లు స్టేషన్ బ్రాంచ్ అధ్యక్షుడిగా జి.రాజేష్, కార్యదరిగా పి.జాఫర్‌ఖాన్‌తో పాటు ఉపాధ్యక్షులుగా రూప్లనాయక్, ఎస్.ఖాజాగరీబ్‌నవాజ్, డి.పరమేష్, సందీప్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎం.మునీర్‌బాషా, వరలక్ష్మి, నరేష్‌కుమార్‌రెడ్డి, మహబుబ్‌బాషాను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన స్టేషన్ బ్రాంచ్ టీమ్‌కు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

నాటు సారాపై నిరంతర దాడులు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుత్తి: నాటుసారాను నిర్మూలించడం కోసం నిరంతరం దాడులు చేయాలని ఎక్సైజ్ పోలీసు అధికారులకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ఏఈఎస్ శ్రీరామ్‌తో కలిసి ఆయన మంగళవారం గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నవోదయం 2.0ను సక్రమంగా అమలు చేసి, నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. నాటు సారా తయారీ, క్రయ, విక్రయాలు, కర్ణాటక మద్యం రవాణాపై నిఘా వేయలన్నారు. మాదక ద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా ఉల్లంఘనలను అరికట్టడానికి ఏ4 దుకాణాలు, 2బీ బార్‌లపై నిరంతరం నిఘా వేయాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్ఐలు అస్లాం బేగ్, గోపాల్ , హెడ్ కానిస్టేబుల్ వెంకట నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ట్రాఫిక్ సర్కిళ్లు



వాసవీ థియేటర్ సమీపంలో సర్కిల్ దిమ్మెకు రోడ్డు కనిపించకుండా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ



అజంతా సర్కిల్‌లోని పాయింట్‌లో రోడ్డుకు అడ్డంగా బ్యానర్లు, జెండాలు



అపోలో సర్కిల్ పాయింట్‌కు ఏర్పాటు చేసిన బ్యానర్



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిరుపయోగంగా మారిన సర్కిల్ పాయింట్

- బ్యానర్లు, ఫ్లెక్సీలకు అడ్డాగా మారిన వైనం
- తరచూ ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు

గుంతకల్లు: పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఉండటానికి ఏర్పాటు చేసిన సర్కిల్ పాయింట్లు నిరుపయోగంగా మారాయి. ఎక్కువగా రద్దీ ఉండే ప్రదేశాల్లో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలనే ఉద్దేశ్యంతో పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలోని వాసవీ థియేటర్ వద్ద, ప్రధాన రహదారులోని ఆర్టీసీ బస్టాండ్, అజంతా సర్కిల్, అపోలో సర్కిల్‌లో ట్రాఫిక్ సర్కిల్ పాయింట్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఈ సర్కిళ్లలో భారీ విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. గతంలో ఈ సర్కిల్ పాయింట్లలో ఓ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించేవారు. గత కొన్ని నెలలుగా ఈ సర్కిల్ పాయింట్లులో కానిస్టేబుళ్లను నియమించడం లేదు. దీంతో సర్కిల్ పాయింట్లు నిరపయోగంగా మారాయి. అయితే రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడానికి మాత్రం బాగానే ఉపయోగపడుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ సర్కిల్‌లో పెద్ద పెద్ద బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇక వాసవీ థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన సర్కిల్ నాలుగు రోడ్లు కలుస్తాయి. అందులోనూ కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయానికి ఈ మార్గం గుండానే వెళ్లాలి. దీంతో ఈ సర్కిల్ పాయింట్ వద్ద నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అలాగే చాలా ఇరుకుగా ఉండే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సర్కిల్ పాయింట్ ధ్వంసమై దిమ్మె మాత్రమే మిగిలింది. ఈ దిమ్మెకు తరుచూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదని వాహనాదారులు వాపోతున్నారు. ఇటీవల అజంతా సర్కిల్ ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ ఈదురుగాలులకు పడిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిన విషయం పాఠకులకు తెలిసిందే. అసలే పట్టణ రహదారులు చాలా ఇరుకుగా ఉంటాయని పైగా సర్కిల్ పాయింట్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు మరింత ఇబ్బందిగా తయారు అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నిరుపయోగంగా మారిన ట్రాఫిక్ సర్కిల్ పాయింట్లను తొలగించడం లేదా ఈ పాయింట్ల వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే కనీసం బ్యానర్లు కట్టకుండా ఉంటారని పట్టణవాసులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





గుంతకల్లు, తాడిపత్రిలో డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, కార్మికులు

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి ప్రతాప్ నారాయణ డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, ఆర్‌టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు కేటాయిస్తూ జారీ చేసిన జీఓను రద్దుచేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలివ్వాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, నటరాజ్, రహంతుల్లా, వెంకటేశ్వర్లు, నరసింహులు, ఖాజా, రమణ పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డిమాండ్ల సాధన కోసం మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ కేజీఎస్‌బాబు, డిపో వర్కింగ్ సెక్రటరీ నాగేశ్వరరెడ్డి, ట్రెజరర్ రెడ్డి, గ్యారేజ్ సెక్రటరీ రామక్రిష్ణ, వైస్ ప్రసిడెంట్ రంగయ్య, షఫీ, యేసోబు తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు వద్ద డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎన్ఎంయూ డిపో కార్యదర్శి ఎన్వీ రాముడు, అధ్యక్షుడు అంజి, సలహాదారుడు శంకరయ్య, గ్యారేజీ సెక్రటరీ గౌడ్, నాయకులు కేబీ ప్రసాద్, రంగనాయకులు, మధు, ఉమా మహేష్, శర్మాస్, నరేంద్ర, రహిమాన్, సుంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిబద్ధతకు హ్యాట్సాఫ్



లోకోపైలట్ నరేంద్రమీనాకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా



తొలి గూడ్స్ లోకోపైలట్ అమలకుమారికి పదోన్నతి పత్రం అందజేస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు: విధి నిర్వహణలో అంకిత భావం, భద్రత పట్ల మీ నిబద్ధతకు హ్యాట్సాఫ్ అని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా లోకో పైలట్స్‌ను అభినందించారు. గత నెల 31న (లోకో నంబర్ 41498, 31709 బీకేఎస్‌సీ) టీఎం 2లో లాక్ చేయబడిన యాక్సిల్ కారణంగా గూడ్స్ రైలు గుత్తి–తాడిప్రతి సెక్షన్‌లోని జక్కలచెరువు రైల్వేస్టేషన్‌లో ప్రవేశించే సమయంలో ట్రాక్షన్ మోటారు నుంచి ప్రమాదవశాత్తు పొగలు వచ్చాయి. గమనించిన గుత్తి డీజల్ షెడ్‌లో లోకోపైలట్‌గా పని చేస్తున్న నరేంద్ర కుమార్ మీనా అప్రమత్తమై ఫాలింగ్ మార్కు తొలగించి, పెద్ద యాంత్రిక వైఫల్యాన్ని నివారించడంతోపాటు రైలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరోధించారు. అలాగే డివిజన్‌లోనే తొలి గూడ్స్ రైలు సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్‌గా అమల కమారి పదోన్నతి పొందారు. దీంతో ఇద్దరినీ డీఆర్‌ఎం మంగళవారం తన చాంబర్‌కు పిలిపించి అభినందించారు కార్యక్రమంలో సీనియర్ డీఈఈ సీ.వీరయ్య, సీనియర్ డీపీఓ కోర్డినేషన్ హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌యూబీల కింద వర్షపు నీరు నిల్వ ఉండరాదు'

గుంతకల్లు: స్థానిక రైల్వే డివిజన్ పరిధిలోని రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ల కింద వర్షపు నీరు నిలవ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా ఆదేశించారు. మంగళవారం ఏడీఆర్‌ఎం యు.సుధాకర్, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో కలసి గుంతకల్లు–కల్లూరు సెక్షన్‌లోని 41బి, 41ఏ. 42బి ఆర్‌యూబీలను డీఆర్‌ఎం పరిశీలించి, మాట్లాడారు. వరద ఆర్‌యూబీల్లో చేరకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్‌యూబీల కింద నిల్వ ఉన్న నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన డ్రెయినీజీల్లో చెత్తాచెదారం పేరుకు పోకుండా చూడాలన్నారు.

సచివాలయాల తనిఖీ

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గుత్తితోపాటు ఆర్ఎస్‌లోని పలు సచివాలయాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు.

సొసైటీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

యల్లనూరు: సహకార పరపతి సంఘం సొసైటీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ చౌదరిని నియమించినట్లు మంగళవారం సీఈఓ వీరనారప్ప తెలిపారు. డైరెక్టర్లుగా రాము, సుబ్బరాయుడుతో సొసైటీ ఏర్పాటైందన్నారు. త్వరలోనే వారు బాధ్యతలు తీసుకోనున్నారు.

కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి

గుత్తి రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీల ఫొటోలు తప్పనిసరిగా మొబైల్ ఫొటో మానిటరింగ్ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు, మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీలో నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారన్నారు. పని ప్రదేశంలో కూలీల హాజరుకు సంబంధించి తప్పకుండా మానిటరింగ్ ద్వారా రోజూ ఉదయం, మధ్యాహ్నం కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ పంపిణీ



యాడికిలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న దృశ్యం

శింగనమల/ గార్లదిన్నె/ యల్లనూరు/ పెద్దవడుగూరు/ యాడికి/ పామిడి/ గుత్తిరూరల్/ బుక్కరాయసముద్రం: నులిపురుగుల వల్ల పిల్లల్లో మానసిక, శారీరకంగా ఎదుగల ఉండదని, నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని శింగనమల మండల వైద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంతరం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో వైద్యులు, మండల విద్యాశాఖాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ ప్రొవైడర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె,యల్లనూరు,పెద్దవడుగూరు,యాడికి,పామిడి,గుత్తి, బుక్కరాయసముద్రం మండలాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు.

● అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన ప్రవాసాంధ్రులు (చిత్రంలో) ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రవాసాంధ్ర నేతలు కలిశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన నేతలను వైఎస్ జగన్‌కు పార్టీ ఎన్ఆర్ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పరిచయం చేశారు. కార్యక్రమంలో కార్తీక్ యల్లాప్రగడ (నెదర్లాండ్), నరేష్ అనుమోలు, వెంకీరెడ్డి, మల్లిరెడ్డి శ్రీవల్లి, నజీర్ (యూకే), చంద్రశేఖర్ రెడ్డి(ఆస్ట్రేలియా), శంకర్‌రెడ్డి(యూఎస్), ఇలియాజ్ (గల్ఫ్ కన్వీనర్), మహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, సుబ్బారెడ్డి (కువైట్), తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



రంగనాథన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం

గుంతకల్లుటౌన్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అధ్యాపకుడు డాక్టర్ గోపినాయక్ సూచించారు. మంగళవారం ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి)లో జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయం ఇన్‌చార్జ్ జహారుల్లా, అధ్యాపకులు జాకీర్‌హుసేన్, అల్తాఫ్, డాక్టర్ బాలకృష్ణ, లైబ్రేరియన్ మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సెంట్రల్ లైబ్రరీ, ఎన్‌డీఎల్ఐ క్లబ్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్తంగా డాక్టర్ వినత ఆధ్వర్యంలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి తోడ్పాటు అందిస్తాయన్నారు. అనంతరం పద్మశ్రీ డాక్టర్ ఎస్.ఆర్.రంగరాథన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భూసార పరీక్షలు తప్పనిసరి

పెద్దవడుగూరు: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయిచుకొని తగిన మోతాదులో రసాయన ఎరువులు వాడాలని ఏఓ మునికృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని చిట్టూరు, చిత్రచేడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పకుండా రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు తప్పనిసరిగా పొలాల్లో సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గుత్తి: పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహ్మద్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. రసాయనాలతో పండించిన పంటలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమిలో జీవి వైవిధ్యం పెంపొందే అవకాశముంటుందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ నరసింహులు, సిబ్బంది బ్యూలా, అరుణ, వసుంధర, రామచంద్ర, బాలరాజు, భాష, మల్లికా తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు లారీల రేషన్ బియ్యం తరలింపు

యాడికి: స్థానిక బలరాముడుకు చెందిన రైస్ మిల్లులో అక్రమంగా డంప్ చేసిన రేషన్ బియ్యం తరలింపు ప్రక్రియ రెండో రోజు మంగళవారమూ కొనసాగింది. కాగా, సోమవారం మొత్తం 7 లారీల్లో రేషన్ బియ్యాన్ని గుంతకల్లులోని స్టాక్ పాయింట్‌కు తరలించిన అధికారులు.. మంగళవారం మరో మూడు లారీల్లో బియ్యాన్ని తరలించారు. మొత్తం పది లారీల్లో రేషన్ బియ్యాన్ని తరలించడం కలకలం రేపింది. కాగా, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఉదయం బలరాముడు రైల్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సీఎస్‌డీటీ మల్లేసు, సీఐ ఈరన్న ఉన్నారు. రేషన్ బియ్యం తరలింపు అనంతరం రైస్ మిల్లును సీజ్ చేశారు.

ఐవైఎం పట్టణ కార్యవర్గం ఎన్నిక

గుంతకల్లుటౌన్: ఐడియల్ యూత్ మూవ్‌మెంట్(ఐవైఎం) పట్టణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐవైఎం పట్టణ అధ్యక్షుడిగా ఖాజా ముక్తియార్, కార్యదర్శిగా షేక్షావలి, కోశాధికారిగా అబ్దుల్ రహిమాన్, ఉపాధ్యక్షుడిగా తన్వీర్ అహమ్మద్, సహకార్యదదర్శిగా సిరాజ్, సహ కోశాధికారిగా హుసేన్‌ఖాన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు హబీబ్, కమిటీ సభ్యులు అబ్దుల్ అజీజ్, తాహిర్, రహిమాన్, ఇమ్రాన్, రఫీక్, నదీమ్, అయూబ్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

గుంతకల్లుటౌన్: స్వాతంత్ర్య సమరయోధుల పోరాటస్ఫూర్తితో మతోన్మాదానికి, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై బహిరంగ అధ్యయన వేదిక నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాల్లో కమ్యూనిస్టులు కూడా కీలకపాత్ర పోషించారన్నారు. ప్రజాకంటక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో చేపట్టబోయే ఉద్యమాల్లో కమ్యూనిస్టు, ప్రజాతంత్ర, అభ్యుదయవాదులు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు నాగరాజు, జగ్గిలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులోని బంటనహాల్‌కు వెళ్లే దారిలోని కంపచెట్ల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.11,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మనోహర్ తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు

యాడికి: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదుచేస్తామని సీఐ ఈరన్న హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో పోలీస్టేషన్ రహదారి వద్ద సీఐ వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ రాజశేఖర్ రెడ్డి, పీసీలు రమేష్, పెద్దన్న, సతీష్ పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని రెండు దేవాలయాలకు చెందిన భూములను కౌలు సాగు కోసం మంగళవారం వేలం వేశామని ఈఓ రామాంజనేయులు తెలిపారు. పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు, కౌలుదారుల సమక్షంలో మూడు సంవత్సరాలకు వేలం నిర్వహించారు పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన మాన్యం తాడిపత్రి మండలం వంగనూరు గ్రామ సర్వే నెంబర్ 61–ఏలోని 5.02 ఎకరాలను ఏడాదికి రూ.13,500కు వెంకటక్రిష్ణయ్య వేలం పాడి దక్కించుకున్నారు. పట్టణంలోని భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి దేవాలయానికి సంబంధించిన మాన్యం యాడికి మండలం తుట్రాళ్లపల్లి సర్వే నెంబర్ 161–ఏ లోని 4.52 ఎకరాలను ఏడాదికి రూ.10,500కు కొండారెడ్డి దక్కించుకున్నారు. గతంలో కేవలం రూ.4,000 కౌలు పొందగా ప్రస్తుతం అదనంగా రూ.6500 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

పాలక మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన పాలకమండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ ఎం.వి జయరాజు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 26వ తేదీ లోపు పూర్తి స్థాయి ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను ఆలయ కార్యాలయంలో అందజేయాలి.

యంగన్నపల్లి సర్పంచ్‌కు ఢిల్లీకి ఆహ్వానం

గుత్తి రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 15న జరిగే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పాల్గొనాలంటూ గుత్తి మండలం యంగన్నపల్లి సర్పంచ్ భరత్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలను గ్రామంలో అందరికీ అందించడంలో సర్పంచ్ భరత్‌కుమార్ సఫలీకృతం అయ్యారు. దీంతో ఈ అరుదైన అవకాశాన్ని ఆయనకు భారత ప్రభుత్వం కల్పించింది.

మహిళకు గాయాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చేనేత కాలనీకి చెందిన కొంతమంది కూలీలు కండ్లగూడూరుకు కూలి పనుల కోసం వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న వస్తున్న మరో ఆటో ఢీ కొంది. ఘటనలో గాయపడిన పుల్లమ్మను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించిట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంపై విచారణ చేపట్టామన్నారు.